దృష్టిలోపం ఉన్న వారితో ఐటిసి మంగళ్‌దీప్ భాగస్వామ్యం

హైదరాబాద్: రాబోయే రోజుల్లో దృష్టి లోపం ఉన్న సమాజంతో మరింత అర్థవంతమైన భాగస్వామ్యాన్ని చేసుకోనున్నట్లు ఐటిసి మంగళ్‌దీప్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ గౌరవ్ తాయల్ తెలిపారు. హైదరాబాద్‌లో సిక్స్త్ సెన్స్ ప్యానెల్ కార్యక్రమంలో 30 మంది దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు సువాసన శిక్షణ ఇచ్చి సత్కరించామన్నారు. 2021లో ప్రారంభమైన ఈ కార్యక్రమం 180 మంది సభ్యులతో విస్తరించి, సువాసన మూల్యాంకన నైపుణ్యాలను మెరుగుపర్చామన్నారు.

బిసిలకు రిజర్వేషన్లు కల్పిస్తే బిజెపికి బాధ ఎందుకు?

- రాష్ట్రపతి ఆమోదం కోసం ప్రయత్నం చేయండి
- ఆర్డినెన్స్ తీసుకొచ్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది : మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే...బిజెపి ఎంపీలకు బాధ ఎందుకని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. గవర్నర్ పంపించిన బిసి రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం పొందేలా బిజెపి ఎంపీలు ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. 2018 పంచాయతీరాజ్ యాక్ట్ ఆధారంగానే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు. ఆర్డినెన్స్ తీసుకొచ్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్ బీర్ల ఐలయ్య, ఈర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్లు నూతి శ్రీకాంత్, మెట్టు సాయికుమార్‌తో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఎందుకు ఆమోదించడంలేదని ప్రశ్నించారు. కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర బిజెపి నేతలపై ఉందని తెలిపారు. రాష్ట్రపతితో ఆమోదింపజేయడంతోపాటు, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించాలని బిజెపి నేతలను డిమాండ్ చేశారు.

రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం

- తుంగతుర్తికి గోదావరి జలాలు తీసుకొస్తాం
- ప్రజాధనం కాజేసిన వారిని ఉరితీయాలి : సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రేషన్ కార్డు పేదవారి ఆత్మగౌరవం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5.61 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీతో పాటు, 26 లక్షల మంది పేర్లను రేషన్ కార్డులలో చేర్చడం ద్వారా 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందించనున్నామని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా గడిచిన పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, సన్న బియ్యంతో అన్నం పెట్టాలన్న ఆలోచన గత పాలకులకు రాలేదని విమర్శించారు. 3.10 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని, 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, తొమ్మిది రోజుల్లో 9,000 కోట్ల రూపాయల రైతు భరోసాను రైతుల ఖాతాలో జమ చేశామని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు, 500 రూపాయలు బోనస్ ఇస్తున్నామని తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి మండల కేంద్రంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రూ.28 వేల కోట్లు ఖర్చుచేసి నిర్మించిన కాళేశ్వరం కూళేశ్వరం అయ్యిందన్నారు. ప్రజాధనాన్ని వృథా చేసిన వారిని కాళేశ్వరంలో ఉరితీయాలని బిఆర్‌ఎస్ నాయకులు ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. మూడు రోజులు సమయం ఇస్తే తుంగతుర్తికి గోదావరి జలాలు తెస్తానని గొప్పలు పలికిన జగదీశ్వర్ రెడ్డి.. పదేళ్లు అధికారంలో ఉండి ఏమి చేశారని ప్రశ్నించారు. గోదావరి జలాలు తేవడం అంటే గ్లాస్‌లో సోడా కలపడం కాదని ఎద్దేవా చేశారు. 2034 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని చెప్పారు. బిఆరెస్ నేతలంతా కట్టకట్టుకుని రండి.. మీరంతా ఒకవైపు.. మా కాంగ్రెస్ కార్యకర్తలు ఒకవైపు అని సవాల్ విసిరారు. దేశంలో ఎస్‌సి ఉప కులాల వర్గీకరణ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు.

లబ్ధిదారుకు రేషన్ కార్డును ఇస్తున్న సిఎం, మంత్రులు తదితరులు

సాయుధ రైతాంగ, రజాకార్ వ్యతిరేక పోరాటాల గడ్డ నల్గొండ జిల్లా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్మించిన నాగార్జునసాగర్ 70 సంవత్సరాలు గడిచిన ఇంతవరకు చెక్కుచెదరలేదని, మూడేళ్లలో కట్టిన కాళేశ్వరం కూలిపోయింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించినప్రాజెక్ట్‌లు మాత్రమే ఇప్పుడు రైతులను ఆదుకుంటున్నాయన్నారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాలలోని ప్రతి ఆడబిడ్డకు రెండు చీరలు ఇస్తున్నామని, రూ. 21 వేల కోట్ల రూపాయలను జీరో వడ్డీతో రుణాలు ఇప్పించామని, రూ.6500 కోట్ల రూపాయల ఉచిత బస్సు ప్రయాణానికి ఆడబిడ్డ కానుకగా ఇచ్చామని, 600 బస్సులను మహిళల ద్వారా కొనుగోలు చేయించి ఆర్‌టిసికి కిరాయికి వారిని యజమానులను చేశామని తెలిపారు. జిల్లా కేంద్రాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులు తెరిపించామని వివరించారు. తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ద్వారా గోదావరి జిల్లాలు తీసుకువచ్చి సస్యశ్యామలం చేస్తామని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునాది గాని కాలువలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణా, గోదావరుల్లో ప్రతి నీటిబొట్టునూ

సద్వినియోగం చేసుకుందాం

- న్యాయపరమైన వాటాల కోసం కేంద్రంపై ఒత్తిడి
- సిఎం రేవంత్ నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలనీ, న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలనీ, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నారు. కృష్ణాతోపాటు గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకోవటంతో పాటు, ఇంతకాలం జరిగిన అన్యాయానికి శాశ్వతమైన పరిష్కారాలను సాధించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనలతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖ రాశారు. ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రితో సమావేశమై తెలంగాణ నీటి వాటాల సాధనతో పాటు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, నీటి కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయించారు.

కృష్ణానదీ జలాల వినియోగంలో ఇంతకాలం తెలంగాణకు తీరని ద్రోహం జరిగిందని అభిప్రాయపడ్డారు. గడిచిన పదేండ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైందని పేర్కొన్నారు. తెలంగాణకు 299 టీఎంసీలు మాత్రమే నీటి వాటాకు అంగీకరించి ఏపీకి 512 టీఎంసీలు కట్టబెట్టిందన్నారు. శ్రీశైలం ఎగువన ఏపీ అక్రమంగా నిర్మించుకున్న ప్రాజెక్టులన్నింటికీ వంత పాడి, కృష్ణా నీళ్లను ఏపీ యథేచ్ఛగా మళ్లించుకుంటే మౌనం వహించిందని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కష్ణాపై నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఇవ్వకుండా అసంపూర్తిగా వదిలేసింది. అటు గోదావరిపై తుమ్మిడిహెట్టిపై చేపట్టిన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత పక్కనబెట్టిందని విమర్శించారు. దానికి బదులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రూ. లక్ష కోట్లకు పైగా ప్రజాధనం దుర్వినియోగం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు

దరఖాస్తు గడువు 17 వరకు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే గడువును ఈనెల 17 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. http//nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 13 వరకు ఉన్న దరఖాస్తు గడువును 17 వరకు పొడిగించామని తెలిపారు. సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించేందుకు తుది గడువు ఈనెల 20వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్రంలోని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపిక మార్గదర్శకాల కోసం పైన పేర్కొన్న కేంద్ర విద్యాశాఖ, పాఠశాల విద్య, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారికి మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ ఐదున అవార్డులను కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే.

గురుకులాల్లో ఆగని మరణాలు

- 20 నెలల్లో 93 మంది విద్యార్థులు మృత్యువాత
- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో మరణాలు ఆగడం లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. వెంటనే నాణ్యమైన ఆహారం అందించేందుకు, ఫుడ్ పాయిజన్లు, ఆత్మహత్యల నిరోధానికి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో 93 మంది విద్యార్థులు మరణించారని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో దేశానికి దిక్సూచిగా నిలిచిన వాటిని దిక్కుమాలిన స్థితికి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా పర్యవేక్షిస్తానన్న ముఖ్యమంత్రి మాటలు నీటిమూటలు కావడంతో గురుకులాలు దీనస్థితిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థి మరణించగా, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినీ ఆత్మహత్య చేసుకుందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా నల్లగొండ జిల్లా దేవరకొండ ఎస్టీ బాలికల గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరగ్గా 15 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారనీ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం బీసీ గురుకులంలో పురుగులన్నం మాకొద్దు అంటూ విద్యార్థులు రోడ్డెక్కారని గుర్తుచేశారు.

PUBLIC NOTICE

This is to inform the general public and financial institution's that, my clients by name **MR. KUMARA,** S/o. Sri Pillappa, aged about 43 years, residing at, # 96A, 3rd Cross, Central Excise Layout, RMV Ext II Stage, Sanjayanagara, Boopasandra, Bangalore-560094 and **MRS. ASHWINI C.S,** D/o. Sannappa, aged about 43 years, residing at No. 495, 5th Main, 5th Cross, 4th Stage, BEML Layout, Rajarajeshwari Nagar, Bangalore – 560098, intends to purchase the below mentioned schedule property from its owner **"M/s. STAY-ON PAPERS PVT LTD"** having old registered office at Ramalaya – 1-7-241, 3rd Floor, Sarojinidevi Road, Secunderabad – 500003. Present Office at: PLOT NO. 31 & 32, Apparel Export Park, Gundlapochampally, Medchal Mandal, Hyderabad, Telangana – 500014 **Represented by it's Director and Authorized Signatory; SRI. ANANTH KISHEN RAO S/o. Gajasimha Rao,** aged about 72 years, residing at: C1, Vikrampuri Colony, next to Bata Showroom, Secunderabad, Hyderabad – 500009 and my clients have entered into an agreement of sale on 17.02.2025. If anybody is having any right, interest, share, claim or objection to the proposed purchase, may file their objections in writing along with copies of supporting documents to the undersigned within 15 days from the date of this publication and a copy of objection to the purchaser's Advocate. Failing which, my client will be advised to go ahead and complete the formalities of the registration of the sale deed.

SCHEDULE PROPERTY

ALL that part and parcel of property bearing old No. 78-61 and New No. 13/10, Old PID No. 78-61-13/10 and New E-PID No. 4914871265, measuring to an extent of 895/49000th, i.e., 895 Sq Ft of Super Built up area and undivided share measuring 376 Sq Feet, in the larger extent of land measuring 20,000/- Sq Feet, consisting in the multistoried commercial building known as West Minister situated at Sampangi Ramaswamy Temple Road, Cunningham Road, Bangalore, within the limits of Bruhat Bengaluru Mahanagara Palike, Vasanth Nagara Ward No. 93.

Ravi C. Sannappa, Advocate
No. 47/4, Samvidhana, 6th Cross Road,
Lavelle Road, Bengaluru – 560001
M: +91 99001 91127
Email: ravicslegal@gmail.com

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
హెచ్.ఎమ్.ఓ.పి.నెం. 30/2025

బిట్వీన్ :
శిరిగినీడి (అనే) మనేడి దుర్గాభవాని,
భర్త: రమేష్, తండ్రి: మనేడి సూర్యచంద్రరావు, హిందూ, స్త్రీ, వయస్సు 30 సం.లు, డోర్ నెం. 4-68-46, కొండాలమ్మగుడి వీధి, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా, ఎ.పి. టిపిజి/ఎస్‌సిజె. ...వాది
శిరిగినీడి రమేష్, తండ్రి: రత్తయ్య, హిందూ, పురుషుడు, వయస్సు 38 సం.లు, ప్లాట్ నెం. 2723, కూరగాయల వ్యాపారం, సూరారం 60, అడ్రస్, ఐ.డి.ఎ. జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, రంగారెడ్డి జిల్లా, మేడ్చెల్, ఎస్‌సిజె. తెలంగాణ-500056. సెల్: 73963 68651 ...ప్రతివాది

పై నెంబరు గ్రంథములో పిటీషనర్ గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారని, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 24-07-2025 తేదీ గురువారం** నాటికి వాయిదా వేసినారు. మీరు ఆ రోజు **ఉదయం గం. 10:30 ని॥లకు** లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, మీ వకీలు గారి ద్వారా గానీ హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.వి. ద్వారకానాథ్
పిటీషనరు తరపు న్యాయవాది
తాడేపల్లిగూడెం
సెల్: 93464 84736
తాడేపల్లిగూడెం
ది. 15-07-2025

'కృష్ణా' నీటి సద్వినియోగానికి చర్యలు

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి
- పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణానది నీటిని తెలంగాణ సమృద్ధిగా వినియోగించేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. పాలేరు ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో భట్టి విక్రమార్క సోమవారం పర్యటించారు. పాలేరు వద్ద పాలేరు రిజర్వాయర్ నుంచి నాగార్జున సాగర్ లాల్ బహదూర్ కెనాల్ ద్వారా ఆయకట్టుకు ఖరీఫ్ సాగుకు సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క, పొంగులేటి మాట్లాడుతూ.. గతేడాది వచ్చిన భారీ వరదల కారణంగా పాలేరులోని నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాలువ అండర్ టన్నెల్ (యూటీ) కొట్టుకుపోయిందని, దాన్ని రూ.14.20 కోట్ల వ్యయంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు పూర్తి చేసి పునరుద్ధరణ చేశామన్నారు. సాగర్ ఆయకట్టు కింద 2.5 లక్షల ఎకరాలకు నీరు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. రాబోయే ఐదు రోజుల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామని, కృష్ణా బేసిన్‌లో పంటలకు ఇబ్బంది లేకుండా నీరు అందిస్తామన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే

వ్యవసాయం, కరెంటు, ప్రాజెక్టులని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదన్నారు. ఎపి ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే కెసిఆర్ పట్టించుకోలేదని తెలిపారు. ఆనాడు తప్పిదాలు చేసిందే కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు అని ఆరోపించారు. తప్పులు చేసిన నేతలే ఇప్పుడు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నదిపై పెండింగ్ ఉన్న కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్, పాలమూరు రంగారెడ్డి ఎస్ఎల్‌బిసి వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు నూతనంగా నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు ప్రభుత్వం నిర్మిస్తుందని తెలిపారు. కృష్ణా నదిలో వీలైనంత మేరకు నీటి వినియోగానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఇ ఎం వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బి ఎస్ఇ యాకుబ్, ఖమ్మం ఆర్‌డిఒ నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కొల్లూరులో వియాన్ ప్రాపర్టీస్ కొత్త ప్రాజెక్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వియాన్ ప్రాపర్టీస్ నగరంలోని కొల్లూరులో 'వియాన్ మిదా' అనే నూతన నివాస ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. ఇరా రియాలిటీతో కలిసి 'ఇరా వియాన్ ప్రాపర్టీస్'గా దీన్ని అందుబాటులోకి తెస్తోంది. ఈ కార్యక్రమానికి వియాన్ ప్రాపర్టీస్ ముఖ్య ప్రతినిధులు అరుణ్ జూపల్లి, సురేంద్రనాథ్ కంచి, సాయి శరవణ వడ్డుల హాజరయ్యారు. 2.62 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాజెక్ట్‌లో జి ప్లస్32 అంతస్తుల ఒక టవర్‌లో 356 ప్రీమియం 2, 3 బిహెచ్‌కె అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయని ఆ సంస్థ తెలిపింది. 40,000 చదరపు అడుగుల క్లబ్‌హౌస్, రెండు అంతస్తుల పార్కింగ్, 100 అడుగుల రోడ్డు యాక్సెస్ ఉన్నాయని పేర్కొంది.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVILJUDGE At :: IBRAHIMPATNAM
O.S.No. 470 OF 2025

Between:-
K. Prashanth Reddy ...Plaintiff
And
The Tahsildhar, Ibrahimpatnam mandal, another ...Defendants

To,
All concerned whom so ever Take Summons that the above suit is filed by the Plaintiff i.e., O.S.No. 470 of 2025 for Declaration of legal heir of Mrs. M. Mounika and in respect of below schedule property. The said suit stands posted to 28-7-2025, at 10:30 A.M. for appearance, if any person or persons are having any right, title or interest in respect of the suit properties, appear in the above mentioned Court either in person or through an advocate, and file writtenstatement otherwise, the matter will be heard and decided by the Hon'ble Court in your absence.

SCHEDULE 'A' PROPERTY.
All that part and parcel of a plot bearing No. 15, admeasuring 200 Sq. yards, in Sy. No. 67/2/AA, 67/7/E, 67/1/A, situated at NKR Enclave, Khanapur village of Highway Colony, (Manchal old mandal) Ibrahimpatnam municipality, R.R.District, Telangana state, bounded by: North : 30 Widw Road, South : Neighbor's land, East : Plot. No. 12 West : Plot. No. 18.

SCHEDULE 'B' PROPERTY
All that part and parcel of the semi finished Flat no. 201, in second floor of 'Spring Field' with a built up are of 1490 Sq. feet consisting of three bedrooms (including common area and covered one car parking), together with proportionate undivided share of land admeasuring 60, Sq. yards out of total admeasuring 600 Sq. yards being constructed on H.No. 1-115/1/B, on Plot No. 7 in Survey number 86 (part), situated at Richmond park, Kondapur village, Sherilingampally mandal and under GHMC Circle, Ranga Reddy District Telangana state, bounded by: North : Open to sky South : Open to sky, East : Open to sky West : Corridor

(BY ORDER OF COURT)
K. RAJENDER REDDY
Advocate
H.No. 7-1-66,
Treasure Enclave Colony,
Nadergul vg, Balapur Mdl,
R.R.District, 9666620888

PUBLIC NOTICE

This is to inform the general public and others that, my client **M/s. STAY-ON PAPERS PVT LTD** having old Registered office at Ramalaya – 1-7-241, 3rd Floor, Sarojinidevi Road, Secunderabad – 500003. Present Office at: PLOT NO. 31 & 32, Apparel Export Park, Gundlapochampally, Medchal Mandal, Hyderabad, Telangana – 500014, **represented by its Managing Director and Authorized Signatory; SRI. ANANTH KISHEN RAO S/o. Gajasimha Rao** Aged about 72 years, Residing at: C1, Vikrampuri Colony, Next to Bata Showroom, Secunderabad, Hyderabad – 500009, has lost the original registered sale deed dated 25.03.1991, vide document bearing No. 4156/1990-91, book No. 1, registered in the office of Sub Registrar – Indiranagar, Bangalore, in respect of the below mentioned schedule property at the time of shifting their office, the said sale deed executed by Indian Financial Association of Seventh Day Adventist in favour of my client **"M/s. STAY-ON PAPERS PVT LTD". Represented by its Director and Authorized Signatory; SRI. ANANTH KISHEN RAO.** In this regard my client has lodged a police complaint before Kharkhan Police Station, Secunderabad,Telangana, on 10.06.2025, during the transit and it is not traced till date, if any person/s find the said document requested to return the same to the undersigned.

SCHEDULE PROPERTY

ALL that part and parcel of property bearing old No. 78-61 and New No. 13/10, Old PID No. 78-61-13/10 and New E-PID No. 4914871265, measuring to an extent of 895/49000th, i.e., 895 Sq Ft of Super Built up area and undivided share measuring 376 Sq Feet, in the larger extent of land measuring 20,000/- Sq Feet, consisting in the multistoried commercial building known as West Minister situated at Sampangi Ramaswamy Temple Road, Cunningham Road, Bangalore, within the limits of Bruhat Bengaluru Mahanagara Palike, Vasanth Nagara Ward No. 93.

ANIL D, Advocate
No. 05, Circular Street, Akkithimanahalli, Shanthinagar, Bengaluru – 560027.
M: +91 9986403058
Email: aniladv@gmail.com

ప్రొఫెసర్ ఉద్యోగోన్నతులు, బదిలీలపై

డిఎంఇతో వైద్యసంఘాల చర్చలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రొఫెసర్ ఉద్యోగోన్నతులు, బదిలీలపై రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ నరేందర్ కుమార్‌తో వైద్య సంఘాలు, డాక్టర్లు సమావేశమై చర్చించారు. ఆదివారం డీఎంఈ నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి మూడు విషయాలపై డీఎంఈ, వైద్య సంఘాలు ఉమ్మడిగా అంగీకారానికి వచ్చాయి. ఈ అంగీకారం ప్రకారం...బహుళ సంవత్సరాలుగా పనిచేస్తున్న ఫ్యాకల్టీకి ప్రత్యేక బదిలీలు/స్థాన చలనం మొదటగా నిర్వహించాలి. అనంతరం అందుబాటులో ఉన్న అన్ని ఖాళీలను పరిగణనలోకి తీసుకొని ప్రొఫెసర్ ప్రమోషన్లు ఇవ్వాలి. పెరిఫెరల్ మెడికల్ కాలేజీలల్లో సేవలందించేందుకు ప్రోత్సహించేలా భత్యాన్ని అమల్లోకి తేనున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీడీఏ) అధ్యక్షులు డాక్టర్ నరహరి, కార్యదర్శి డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీటీజీడీఏ) అధ్యక్షులు డాక్టర్ కిరణ్ బొల్లేపాక, సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదల తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ వెబ్‌ఆప్షన్లలో మార్పులకు నేడే ఆఖరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా వెబ్‌ఆప్షన్లలో మార్పు, చేర్పులకు మంగళవారమే చివరి రోజు. రాష్ట్రంలో 95,256 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారిలో 94,059 మంది అభ్యర్థులు 56,63,308 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారు. రాష్ట్రంలో 172 ఇంజినీరింగ్ కాలేజీల్లో 83,054 సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయి. మాక్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈనెల 12న 77,154 (92.89 శాతం) మంది అభ్యర్థులకు సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఇంకా 5,900 (7.11 శాతం) సీట్లు మిగిలాయి. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం, ఇతర కారణాల వల్ల 16,905 మందికి సీట్లు కేటాయించలేదు. మంగళవారం వరకు మాక్ కౌన్సెలింగ్ వెబ్‌ఆప్షన్లలో మార్పు, చేర్పులకు అవకాశం కల్పించింది. వాటినే ఎప్‌సెట్ మొదటి విడత వెబ్‌ఆప్షన్లుగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. ఒకవేళ ఆప్షన్లను మార్చుకుంటే వాటినే ఎప్‌సెట్ మొదటి విడత ఆప్షన్లుగా పరిగణిస్తామని తెలిపింది. ఈనెల 18న ఎప్‌సెట్ తొలివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని ప్రకటించింది. ఇతర వివరాలు, వెబ్‌ఆప్షన్ల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరింది.

సభలో మాట్లాడుతున్న ఎండి అబ్బాస్

స్వాతంత్ర్య పోరాటంలో

మైనారిటీల పాత్ర మరువలేనిది

- ఆవాజ్ రాష్ట్ర మూడో మహాసభలో ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మైనార్టీలు నిర్వహించిన పాత్ర మరువలేనివని, వారి త్యాగాలు వెలకట్టలేనివని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ అన్నారు. ఆవాజ్ రాష్ట్ర మూడో మహాసభ సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో సోమవారం "భారత స్వాతంత్ర్య ఉద్యమం మైనారిటీల పాత్ర" అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో సరిహద్దు గాంధీగా పేరుపొందిన అబ్దుల్ గఫార్‌ఖాన్, టిప్పు సుల్తాన్‌తోపాటు ఆబాది బానోబేగం, హాజరా బేగం వంటి మహిళలు కూడా నాటి స్వాతంత్ర్య సమరయోధుల పిలుపునందుకుని ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేసి.. ఆస్తులను సమాజానికి దానం చేసి స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకున్నారని వివరించారు. మైనారిటీలు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈస్ట్ ఇండియా కంపెనీ దేశ ప్రజలపై విధించిన అధిక పన్నులు, దోపిడీ పీడనకు వ్యతిరేకంగా కులాలు మతాలు ప్రాంతాలకు అతీతంగా ప్రజలను సంఘటితపరిచారని తెలిపారు. ఆంగ్లేయులను భరతభూమి నుంచి పూర్తిగా తరిమికొడితేగానీ దోపిడీ పీడన నుంచి విముక్తి లేదంటూ.. రాజ్య క్షేమం, ప్రజల సౌభాగ్యాన్ని ఆకాంక్షిస్తూ సామ్రాజ్యవాదంపై సమర శంఖం పూరించి చివరి వరకు నిలబడిన పోరాటయోధులని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబుకు వ్యతిరేకంగా షోయబుల్లాఖాన్ షేక్ బందగి వంటి వీరులు పోరాడి ప్రాణం కోల్పోయారని గుర్తుచేశారు. పెట్టుబడిదారి విధానాలకు వ్యతిరేకంగా.. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను, కార్మికులను ఐక్యం చేసి సహజ వనరుల రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుదామన్నారు. ఈ సభలో స్వాతంత్ర్య సమరయోధుల ఎగ్జిబిషన్‌ను రిటైర్డ్ ప్రిన్సిపాల్ జలీల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికూర్ రెహమాన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి సీపీఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, పాలమూరు అధ్యయన వేదిక ఇక్బాల్ పాషా, కురువ పల్లయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు తహెర్, నాయకులు రంగు మదిలేటి, ఆంజనేయులు, స్వేరోస్ సునందం, వీవీ నరసింహ, ఉప్పేర్ నరసింహ పాల్గొన్నారు.

చట్టాల సరళీకరణ వల్లే సిగాచీ ప్రమాదం

- పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై తనిఖీలు చేయాలి
- ప్రమాణాలు పాటించకుంటే జైలు శిక్ష విధించాలి
- ఫ్యాక్టరీస్ ఆఫ్ డైరెక్టరేట్ వద్ద ధర్నాలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాజమాన్యాలకు అధిక లాభాలు కట్టబెట్టేందుకు చట్టాలు సరళీకరించడం, పరిశ్రమల్లో అధికారులు సరైన తనిఖీలు చేపట్టకపోవడం వల్లనే సిగాచీ పరిశ్రమలో భారీ ప్రమాదం జరిగిందని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు నొక్కి చెప్పారు. గతంలో పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకుంటే జైలు శిక్ష విధించే నిబంధనలుండేవనీ, ప్రస్తుతం దానికి పాలకులు తూట్లు పొడిచారని విమర్శించారు. అన్ని పరిశ్రమల్లోనూ భద్రతా ప్రమాణాలపై తరుచూ తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఫ్యాక్టరీస్ ఆఫ్ డైరెక్టరేట్ వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టిఎన్‌టియుసి, టియుసిఐ, బిఆర్‌టియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, జె.చంద్రశేఖర్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అనురాధ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకె. బోస్, బీఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి కెవిఎస్. రవికుమార్, సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అశోక్, హైదరాబాద్ అధ్యక్షులు జె. కుమారస్వామి, హైదరాబాద్ సౌత్ అధ్యక్షులు మీనా, ఏఐటీయూసీ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని "సిగాచి" ఫార్మా కంపెనీలో ప్రమాదంలో మరణించిన వారికి కోటి రూపాయల పరిహారం తక్షణమే చెల్లించాలనీ, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలనీ, క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చెల్లించి ప్రభుత్వమే వారి బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేయడానికే పరిమితం కాకుండా కార్మికుల రక్షణ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రక్షణ విషయంలో ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందింది అంటున్న "సిగాచి"లో ఇంత పెద్ద పేలుడు సంభవించడానికి కారణం ప్రభుత్వ విధానపరమైన లోపాలు తప్ప మరొకటి కాదని చెప్పారు. యాజమాన్యాలను సంతృప్తిపరచడం, వ్యాపారం సులభతరం చేయడం కోసం కార్మికుల ప్రాణాలను పాలకులు ఫణంగా పెడుతున్నారని విమర్శించారు. పరిశ్రమల్లో ప్రమాదాలకు ప్రభుత్వాలు కూడా బాధ్యత వహించాలని కోరారు. సిగాచి పరిశ్రమలో ప్రమాద సమయంలో 143 మంది కార్మికులంటే అందులో సగం మందికి పైగా ఆంధ్రా, ఒడిశా, బెంగాల్, ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన వలస కార్మికులే ఉన్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం ఎక్కడ అమలవుతుందని ప్రశ్నించారు.

ఫ్యాక్టరీస్ ఆఫ్ డైరెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు

బంధన్ ఎఎంసికి 25 ఏళ్లు

హైదరాబాద్ : ప్రముఖ అసెట్ నిర్వహణ సంస్థల్లో ఒకటైన బంధన్ ఎఎంసి భారత మ్యూచువల్ ఫండ్ రంగంలో 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని విజయవంతంగా ముగించుకున్నట్లు తెలిపింది. ఈ మైలురాయిని ఇన్వెస్టర్లు, భాగస్వాములతో కలిసి జరుపుకున్నట్లు పేర్కొంది. "25 ఏళ్ల ప్రయాణంలో కోట్లాది పొదుపుదార్లను ఇన్వెస్టర్లుగా మార్చడంలో మా పాత్రపై గర్విస్తున్నాం. ఎఎన్‌జడ్ గ్రిండ్‌లేస్ మ్యూచువల్ ఫండ్‌గా ప్రారంభమై స్టాండర్డ్ చార్టెడ్, ఐడిఎఫ్‌సి ఎఎంసి ద్వారా బంధన్ ఎఎంసిగా రూపాంతరం చెందిన ప్రతి దశలో ఆర్థిక సమ్మిళితం, నూతన ఆలోచనలకు కట్టుబడ్డాం." అని ఆ సంస్థ సిఇఒ విశాల్ కపూర్ పేర్కొన్నారు.

నిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

- దీర్ఘకాలిక పల్మనరీ థ్రోంబో ఎంబోలిజం వ్యాధికి ట్రీట్‌మెంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక నిమ్స్ ఆస్పత్రి మరో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. కరీంనగర్ జిల్లా కోహెడ్ మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన రాచకొండ శివ ప్రసాద్ రావు ఒక సంవత్సరానికిపైగా దీర్ఘకాలిక పల్మనరీ థ్రోంబోఎంబోలిజం అనే వ్యాధితో బాధపడుతున్నారు. అతనికి శస్త్రచికిత్స చేయడం తప్పనిసరైంది. ఈ క్లిష్టమైన ప్రక్రియలో పల్మనరీ ధమనుల్లో దీర్ఘకాలిక రక్తం గడ్డకట్టడాన్ని సున్నితంగా తొలగించి ప్రత్యేకమైన హార్డ్ ఫెల్ట్‌ను ఉపయోగించి ట్రైకస్పిడ్ వాల్వ్‌ను మరమ్మతు చేశారు. ఈ శస్త్రచికిత్సను నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ అమరేష్ పర్యవేక్షణలో అదనపు ప్రొఫెసర్ డాక్టర్ సూర్య సత్య గోపాల్ విజయవంతంగా పూర్తి చేశారు. శివప్రసాద్ ను మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేయనున్నారు.

తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మహిళా కమిషన్‌కు తెలంగాణ జాగృతి ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి మహిళా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ మహిళా కమిషన్ కార్యాలయంలో ఈమేరకు ఫిర్యాదు చేశారు. చైర్ పర్సన్ నేరెళ్ల శారద అందుబాటులో లేకపోవడంతో కమిషన్ సభ్యులకు ఫిర్యాదు అందజేశారు. అంతకు ముందు కార్యాలయం లోనికి అనుమతించక పోవడంతో గేట్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు.

శ్రమ శ్రామికులది.. ఫలితం పెట్టుబడిదారులకా..?

- కార్మిక సంఘాల విచ్ఛిన్నానికి మోడీ కుట్ర
- హక్కుల రక్షణకు సంఘటితంగా ముందుకు పోదాం
- చుక్కా రాములు, పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులు చెమట చుక్కలు చిందించడం ద్వారా వచ్చే సంపదను ప్రధాని మోడీ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలో సిఐటియు జిల్లా నాలుగో మహాసభ సోమవారం ప్రారంభమైంది. అనంతరం సహారా ఫంక్షన్ హాల్‌లో జరిగిన బహిరంగ సభలో వారు ప్రసంగించారు. ప్రజాస్వామ్య దేశంలో పాలకుల పనితీరుపై ప్రశ్నించాలని చెప్పారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు.. ప్రజల పక్షాన పని చేయకుండా పెట్టుబడిదారుల పక్షాన పనిచేస్తున్నారని విమర్శించారు. సంపద పెట్టుబాడిదారుల పెట్టుబడితో రాదని, రైతులు, శ్రామికులు, వ్యవసాయ కార్మికుల శ్రమతో సంపద సృష్టించబడుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. పని చేసే ప్రతి ఒక్క కార్మికునికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోడీ పెట్టుబడిదారుల పక్షాన ఉంటే, కార్మికుల పక్షాన వామపక్షాలు, సిఐటియు, ఎర్రజెండా అండగా ఉండి పోరాడుతున్నాయని స్పష్టం చేశారు. స్కీం వర్కర్లు, గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్లు, బీడీ కార్మికులు, అన్ని రంగాల కార్మికుల బతుకులు బాగుపడాలన్నా.. శ్రమకు తగిన ఫలితం దక్కాలన్నా పెట్టుబడిదారుల విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులపై దాడి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మనం సంఘటితంగా ఉండకుండా చేయాలనే కుట్రను, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న ఐక్య ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె విజయవంతంగా చేశామని గుర్తు చేశారు. కలిస్తే నిలుస్తాం.. నిలిస్తే గెలుస్తాం.. ఇది మన సిద్ధాంతంగా పెట్టుకొని కలుద్దాం.. నిలుద్దాం.. గెలుద్దాం అంటూ సంఘటితంగా ముందుకు పోదామని సూచించారు. సిఐటియు ఆల్ ఇండియా మహాసభ విశాఖపట్నంలో జరగనుందని, అంతకు ముందుగా జిల్లా, రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నామని తెలిపారు. సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, మండల రాజు, పుట్టా ఆంజనేయులు, జి.బాలయ్య, నిక్సన్, శివలీల, శారద, ఆర్ఎస్.రమేష్, గోనెల ఆంజనేయులు, ఉష, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల తొమ్మిదిన జరిగిన సమ్మె (ఫైల్)

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్

- 35 మంది విద్యార్థినులకు కడుపు నొప్పి, విరోచనాలు
- దేవరకొండ తూర్పుపల్లి ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో సోమవారం ఫుడ్ పాయిజన్ అయ్యింది. దాంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 310 మంది విద్యార్థినులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం అల్పాహారంలో పెసర గుగ్గిళ్లు పెట్టారు. రాత్రి భోజనంలో బగారా, చికెన్ కూర పెట్టారు. భోజనం తిన్న తర్వాత హాస్టల్లో కొంతమంది విద్యార్థినులకు కడుపు నొప్పితోపాటు విరోచనాలు అయ్యాయి. సోమవారం ఉదయం అల్పాహారంగా పులిహోర పెట్టారు. అల్పాహారం తిన్న అనంతరం 35 మంది విద్యార్థులు కడుపు నొప్పి, విరోచనాలతో బాధ పడుతుండటంతో ఉపాధ్యాయులు ఏఎన్ఎం సహాయంతో ముదిగొండ గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని ఆర్ఎంపీ డాక్టర్ సూచించారు. దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో 13 మంది, మండలంలోని తూర్పుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 22 మందిని చేర్పించారు. రెండు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందిన బాలికల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. ఫుడ్ పాయిజన్ వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్టు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఆర్డీఓ రమణారెడ్డి, ఎంపీడీవో డానియల్, సీఐ నర్సింహులు ఆస్పత్రులకు చేరుకొని బాలికలను పరామర్శించారు. అనంతరం ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

- భవనంపై నుంచి దూకిన వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకుల పాఠశాల భవనంపై నుంచి కిందకు దూకి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం ఉదయం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్(అంబర్‌పేట)లో జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా మక్తల్ మండలం విఠలాపురం గ్రామానికి చెందిన వి.సంధ్య(10) తూప్రాన్‌పేటలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది.

కొత్త విద్యార్థినులకు పాఠశాలలో హోమ్ సిక్ హాలిడేస్ ఇవ్వడంతో సంధ్యను తల్లిదండ్రులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం తిరిగి హాస్టల్‌కు సంధ్యను ఆమె తల్లి తీసుకొచ్చారు. రాత్రి స్టడీ అవర్ తర్వాత విద్యార్థినులు వారి వారి గదుల్లోకి పడుకోవడానికెళ్లారు. అందరూ పడుకున్నాక సంధ్య పాఠశాల భవనంపై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. సోమవారం తెల్లవారుజామున వాచ్‌మెన్ చూడటంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'దుర్గాబాయి' ఆస్పత్రిలో దారుణం

- రోగి భార్యతో అసభ్యకరంగా వార్డు బాయ్
- చితకబాది పోలీసులకు అప్పగించిన సహాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గాబాయి దేశముఖ్ ఆస్పత్రిలో దారుణ ఘటన జరిగింది. వైద్యం కోసం ఆస్పత్రిలో చేరిన ఓ రోగి భార్య పట్ల వార్డు బాయ్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు కేకలు వేయడంతో ఇతర రోగుల అటెండర్లు ఆ ప్రబుద్ధున్ని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌లో నివాసముంటున్న ఓ వ్యక్తి డెయిరీ ఫాం నిర్వహిస్తున్నాడు. అతనికి ఇటీవల హైబీపీ రావడంతో విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశముఖ్ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షించి ఐసీయూలో పెట్టి చికిత్స చేశారు. రెండ్రోజుల తర్వాత అతని ఆరోగ్య పరిస్థితి మెరుగవడంతో ఆదివారం జనరల్ వార్డులోని షేరింగ్ రూమ్‌కు మార్చారు. అతనికి సహాయంగా భార్య ఉంటున్నది. కాగా, సోమవారం తెల్లవారుజామున ఉదయం 3.30 గంటల సమయంలో జనరల్ వార్డులో నైట్ డ్యూటీ విధుల్లో ఉన్న వార్డు బాయ్(రాంనగర్ నివాసి) సీతారాం రోగి బెడ్ షీట్ మార్చుతానని షేరింగ్ రూంలోకి వచ్చాడు. రోగి నిద్రపోతుండటాన్ని గమనించి గది తలుపుకు గడియ పెట్టాడు. రోగి భార్య భార్య చేయి పట్టుకొని అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో ఆమె కేకలు పెట్టడంతో తోటి పేషెంట్ల సహాయకులు నిద్ర లేచి సీతారాంను పట్టుకొని చితకబాదారు. అనంతరం నల్లకుంట పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. లిఖిలపూర్వకంగా ఫిర్యాదు అందడంతో ఓయూ ఏసీపీ జగన్, నల్లకుంట సీఐ జగదీశ్వర్ రావు, ఎస్ఐ లక్ష్మీనారాయణ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. షేషెంట్ల సహాయకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నిందితుడు సీతారాంపై బీఎన్ఎస్ 74, 75, 78 నానబెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినీనటి సరోజా దేవి మృతికి సంతాపం

- టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ సినీనటి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత బి. సరోజాదేవి మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ తన సంతాపాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె సహజ నటనతో కోట్లాది మంది ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారని గుర్తు చేశారు. భారత సినీ రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ఆయన సానుభూతిని తెలియజేశారు.

ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఆయిల్ పామ్ సాగులో రాష్ట్రాన్ని అగ్రభాగంలో నిలబెడతాం

- పది జిల్లాల్లో 10 ఫ్యాక్టరీలు
- రైతుకు ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆయిల్ పామ్ సాగులో రాష్ట్రాన్ని అగ్రభాగంలో నిలబెట్టి రైతులకు లాభాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం పెదవేడు గ్రామంలో పీసరి అనిత సురేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఇచ్చే ఆయిల్ పామ్ పంటను సాగు చేసుకోవాలని తెలిపారు. మనదేశంల ప్రతి ఏడాది వంద లక్షల మెట్రిక్ టన్నుల పామాయిల్ దిగుమతి చేసుకుంటోందని, తద్వారా దేశ సంపద ఇతర దేశాలకు వెళ్తుందన్నారు. మన దేశానికి అవసమయ్యే ఆయిల్ తోటలను తెలంగాణలోనే సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 3లక్షల ఎకరాల్లో సాగవుతోందని, విడతల వారీగా 20 లక్షల ఎకరాల సాగు పెంపునకు ప్రణాళికలు తయారు చేశామని అన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ చుట్టూ రిజనల్ రింగ్ రోడ్డు నిర్మించనున్నట్టు తెలిపారు. దాంతో చుట్టుపక్క ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దావోస్ వెళ్లినప్పుడు ఆయిల్ పామ్ సీడ్ గార్డెన్ ఉత్పత్తి కోసం గోద్రేజ్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నట్టు గుర్తు చేశారు. వచ్చే నెలలోనే సీఎం చేతులమీదుగా సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పామ్ విత్తనాలతో పామాయిల్ తయారు చేసే కంపెనీని ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల్లో 10 ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం అల్వాల్ గ్రామంలో కూడా ఆయిల్ పామ్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. పామాయిల్ దిగుమతి సుంకంపై దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులందరూ కలిసి ప్రధానమంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. దిగుమతి సుంకం పెంచితే రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. గుడి మల్కాపూర్ మార్కెట్‌ను ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో అజీజ్ నగర్ రెవెన్యూలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ యాస్మిన్ భాష, జాయింట్ డైరెక్టర్ సంగీతలక్ష్మి, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

కాంగ్రెస్ డైరెక్షన్‌లోనే కవిత యాక్షన్

- బిసి రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ పేరిట కాంగ్రెస్ డ్రామాలు
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ డైరెక్షన్‌లోనే మాజీ ముఖ్యమంత్రి కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీలపై దాడులు చేస్తున్నారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపణలు చేశారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కవితకు బీసీ రిజర్వేషన్లకు ఎలాంటి సంబంధమూ లేదని తాను చేసిన వ్యాఖ్యలు తెలంగాణ సామెతలో భాగమేనన్నారు. ఆదివారం తనపైనా.. తన మీడియా సంస్థపైనా కవిత మనుషులు విచక్షణారహితంగా దాడులు చేయడమే కాకుండా తనను చంపే కుట్ర చేశారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రధాన మంత్రిని కలిసి 9వ షెడ్యూల్‌లో పెట్టాలని ఎందుకు డిమాండ్ చేయడం లేదో సమాధానం చెప్పాలన్నారు. ఆర్డినెన్స్ పేరిట కాంగ్రెస్ పార్టీ డ్రామాలు మొదలు పెట్టిందని, దానికి కవిత వంత పడుతున్నారని విమర్శించారు. బీసీలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకునే రోజులు పోయాయని, ఇప్పుడు బీసీలందరూ సంఘటితమయ్యారని అన్నారు. తగిన విధంగా బుద్ధి చెప్పే రోజులు వస్తాయని హెచ్చరించారు. తనపై హత్యాయత్నం చేసిన వారిపై కేసులు నమోదు చేయకుండా.. దాడికి గురైన వారిపైనే కేసులు నమోదు చేయడం వెనుక పోలీసుల ఆంతర్యం ఏంటో అర్థం కావడం లేదని వాపోయారు. తనపై జాగృతి పేరిట జరిగిన హత్యాయత్నంపై శాసనమండలి చైర్మెన్‌తోపాటు బీసీ కమిషన్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ సుదగాని హరిశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి డాక్టర్ శబరిష్

ఐదుగురు మావోయిస్టులు లొంగుబాటు

- ములుగు జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివిధ హోదాల్లో సిపిఐ(మావోయిస్టు)లో పని చేస్తున్న ఐదుగురు మావోయిస్టు సభ్యులు సోమవారం ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్.పి సమక్షంలో లొంగిపోయారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. లొంగిపోయినవారిలో ఒకరు ఏసిఎం హోదాలో, నలుగురు పార్టీ సభ్యులుగా ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు తక్షణంగా ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున మొత్తం రూ.1.25లక్షలు అందజేశారు. మిగిలిన మొత్తం రూ.6,75,000ను ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు అందిన వెంటనే వారి ఖాతాల్లో చెక్కుల రూపంలో జమ చేయనున్నట్టు తెలిపారు. లొంగిపోయిన వారిలో చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా జెట్టపాడు గ్రామానికి చెందిన శ్యామల రాజేష్ అలియాస్ ఐత (22), అదే జిల్లా గొమ్ము గ్రామానికి చెందిన కస్తిల్దుమ (20), బీజాపూర్ జిల్లా పెద్ద బట్టిగూడెం కొండపల్లి గ్రామానికి చెందిన ఊకె జోగి (18), అదే గ్రామానికి చెందిన బాడీసే బీమా (21), అదే జిల్లా తంబెల్‌బట్టి గ్రామానికి చెందిన ముచక జోగి(16) ఎస్పీ ముందు లొంగిపోయిన వారిలో ఉన్నారు.

గిరిజన గురుకులాల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు గిరిజన సంఘాల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన గురుకుల విద్యాసంస్థలో మిగిలిపోయిన సీట్లను త్వరగా భర్తీ చేసేందుకు గిరిజన గురుకుల సంస్థకు అనుమతివ్వాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు గిరిజన సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య అంజయ్య నాయక్, గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం బాలు నాయక్, గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నేనావత్ రూప్ సింగ్, నాయకులు ఇస్లావత్ శ్రీను నాయక్ వినతి పత్రాన్ని సమర్పించారు. రూ.154 కోట్ల బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను విడుదల చేయాలనీ, అంబేద్కర్ విద్యా నిధి పథకంలో విదేశీ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల లిస్టును తక్షణం ఆమోదించాలని కోరారు. గిరిజన గురుకుల విద్యాసంస్థ మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న సంక్షేమ గురుకుల కార్యదర్శి అలగు వర్షిణి వ్యవహార శైలిని కట్టడి చేయాలని కోరారు. గురుకులాల సెట్ కన్వీనర్ గా వ్యవహరించిన ఆమే గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో మిగిలిన వేలాది సీట్లను భర్తీ చేసుకోవడానికి గిరిజన గురుకుల విద్యాసంస్థకు బదిలీ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గురుకులాల్లో సీట్లు రానివారు, పరీక్ష రాయని వారు వందలాదిమంది విద్యార్థులు,వారి తల్లిదండ్రులు గిరిజన గురుకుల సంస్థకు వచ్చి పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. మంత్రి స్పందిస్తూ బెస్ట్ అవైలబుల్ పథకం బకాయిలను, సీఎం వద్ద ఉన్న అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకంలోని విద్యార్థుల లిస్టుకు సంబంధించిన సమస్యలను పరిష్కారం చేసేందుకు తగిన కృషి చేస్తామని హామీ ఇచ్చారు.


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

మళ్లీ కల్తీ కల్లు కలకలం

- జీడిమెట్లలో వృద్ధ దంపతులకు అస్వస్థత
- కూకట్‌పల్లి ఘటనలో 9 మందికి చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితులు ఇంకా ఆస్పత్రుల్లోనే చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలోనే జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కల్తీ కల్లు ఘటన కలకలం రేపుతోంది. కల్లు తాగిన వృద్ధ దంపతులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకెళ్తే.. నిజామాబాద్ జిల్లాకు చెందిన లచ్చిరాం, ఆయన భార్య సాక్రిభాయ్ రెండ్రోజుల కిందట గాజుల రామారంలో తమ కుమార్తె రేఖ వద్దకొచ్చారు. ఆదివారం సాయంత్రం రాంరెడ్డి నగర్‌లోని ఓ కల్లు దుకాణంలో కల్లు తాగారు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురైన దంపతులను కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు.

తొమ్మిదికి చేరిన కల్తీకల్లు మృతుల సంఖ్య

కూకట్‌పల్లి కల్తీకల్లు ఘటనలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగమణి సోమవారం చనిపోయారు. శుక్రవారం సాయిచరణ్ కాలనీకి చెందిన చాకలి పెద్దగంగారాం(70) చనిపోయిన విషయం తెలిసిందే. గత మంగళవారం (ఈ నెల 8న) కేపీహెచ్‌బీ కాలనీలోని కల్లు కాంపౌండ్‌లో హైదర్‌నగర్, సాయిచరణ్ కాలనీలకు చెందిన పలువురు కల్లు తాగి అస్వస్థతకు గురికాగా.. నిమ్స్, గాంధీ ఆస్పత్రుల్లో చేరారు. కాగా, కల్తీ కల్లు కేసులో కాంగ్రెస్ నేత కూన సత్యంగౌడ్‌ను బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆయన కుమారులు రవితేజగౌడ్, సాయితేజగౌడ్‌ను కూడా అరెస్టు చేశారు. వీరు హైదర్‌నగర్, ఎస్పీనగర్, ఇంద్రానగర్‌లో కల్లు దుకాణాలు నడిపిస్తున్నారు. ఈ మూడు దుకాణాల్లోని కల్లు నమూనాల్లో ఆల్ప్రాజోలం కలిపినట్టు తేలింది. కల్తీ కల్లు దందాపై చర్యలు తీసుకోకపోవడంతో బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ డి.వేణుకుమార్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. డీటీఎఫ్ నర్సిరెడ్డి, ఏఈఎస్‌లు మాధవయ్య, జీవన్‌కిరణ్, ఈఎస్ ఫయాజ్ తదితరులపై విచారణకు ఆదేశించారు.

గాంధీ, నిమ్స్‌లో చికిత్స

గాంధీ ఆస్పత్రిలో 16 మంది కల్తీ కల్లు బాధితులు చికిత్స పొందుతుండగా.. సోమవారం నలుగురు డిశ్చార్జి అయ్యారు. మరో ముగ్గురు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో మొత్తం 36 మంది చేరగా.. 23 మందికి చికిత్స కొనసాగుతోంది. 13 మంది మూడు రోజుల కిందట డిశ్చార్జి అయ్యారు. మరో 7 మందిని ఇండ్లకు పంపించనున్నారు. బాధితుల పరిస్థితిని మల్టీ స్పెషాల్టీ టీం ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నట్టు నిమ్స్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు.